సాక్షి
మహబూబాబాద్
గురువారం । 14 । మార్చి । 2024



సర్వమానవాళి ఆధ్యాత్మికతతో ఎదగాలి

సర్వమానవాళి ఆధ్యాత్మికతతో ఎదగాలని హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోని అన్నారు. - 8లో▸



పర్యాటకుల కల నెరవేరేనా..?

చారిత్రక కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటలోని మ్యూజియం ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోవడం లేదు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
39.4^0 /22.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి కాస్త చలిగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
గురు 6:31	శుక్ర 5:02

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మహబూబాబాద్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలీస్, రెవెన్యూ, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి ఎన్నికల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఎన్నికల విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మోడల్ కోడ్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. అందరూ బాధ్యతాయుతంగా పని చేస్తేనే ఎన్నికలు విజయవంతం అవుతాయన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్/నెహ్రూసెంటర్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేసేందుకు ప్రొఫెసర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ లాకావత్ బుధవారం తెలిపారు. 6 ప్రొఫెసర్ పోస్టులు, 22 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 12 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 29 ట్యూటర్ పోస్టులు, 27 సీనియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు విద్యార్హత, కులం, నివాస ధ్రువీకరణ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5గంటల వరకు మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు



నెల్లికుదురు: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని తొర్రూరు డీఎస్పీ సురేష్ హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయగా, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ బుధవారం వివరాలు వెల్లడించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడితే క్రిమినల్ కేసులు తప్పవన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను సీఐ సంజీవ, ఎస్సై క్రాంతికిరణ్‌తో కలిసి పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

ఉచిత శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తామని, అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి నర్సింహారావు బుధవారం తెలిపారు. బుక్ ఫౌండేషన్ వారు ఉచితంగా శిక్షణను అందిస్తారని, ఈ నెల 14వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు బీసీ అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

మరిపెడ: మరిపెడ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ బుధవారం సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, సీసీ కెమరాల పనితీరును పరిశీలించారు. సీఐ హతీరాం, ఎస్సై తాహేర్‌బాబా ఉన్నారు.

పైరవీల దందా!

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులకు ఎర

- 37 ఉద్యోగాలకు 1657 దరఖాస్తులు
- గతంలో ఉద్యోగాల భర్తీలో అక్రమాలు
- అదే రీతిలో వసూళ్లకు ప్రయత్నాలు
- నిరుద్యోగుల్లో ఆందోళన



దరఖాస్తులు అందించేందుకు క్యూలో నిలబడిన నిరుద్యోగులు(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పైరవీకారులు నిరుద్యోగులకు ఎర వేస్తున్నారు. వైద్యారోగ్యశాఖ ద్వారా 37జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగాలు భర్తీ చేయనుండగా.. 1657 దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో ఆశాఖలో పనిచేస్తున్న పలువురు పైరవీకారులు ఉద్యోగాలు ఇప్పిస్తామని వసూళ్లు చేస్తున్నట్లు ప్రచారం. కాగా గతంలో డబ్బులు ఇస్తే ఉద్యోగాలు వచ్చినట్లు ప్రచారం జరిగింది. దీంతో ప్రస్తుతం కూడా డబ్బులు ఇస్తే ఉద్యోగం వస్తుందని భావించిన పలువురు నిరుద్యోగులు పైరవీకారులను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది.

37పోస్టులు.. 1657 దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్టాఫ్ నర్సు, ఇతర ఉద్యోగాలను రెగ్యులర్ పద్ధతిన భర్తీ చేసింది. కొత్తగా ఉద్యోగం వచ్చిన వారు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఈమేరకు 37 పోస్టులు ఖాళీ అయ్యాయి. వీటిని భర్తీ చేసేందుకు జిల్లా అధికారులు ప్రకటించిన నోటిఫికేషన్‌తో జిల్లా నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి 1,657 మంది దరఖాస్తు చేసుకున్నారు.

గతంలో ఆరోపణలు..

జిల్లా వైద్యారోగ్యశాఖలో గతంలో అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఆశాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు నిరుద్యోగుల నుంచి డబ్బులు తీసుకొని సెకండ్ ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, డైక్, టీబీ నిర్మూలన టీం మొదలైన ఉద్యోగాలు ఇచ్చినట్లు సమాచారం. మెరిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులకు కాకుండా లంచం ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చినట్లు, ఇతర ఆరోపణలు వచ్చాయి. దీంతో కొంతమంది అభ్యర్థులు గత కలెక్టర్ శశాంకకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణలో ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి సైతం ఉద్యోగాలు ఇచ్చినట్లు రుజువైంది. ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ వైద్యారోగ్యశాఖ ఉద్యోగాల భర్తీపై జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిని పర్యవేక్షకులుగా నియమించారు. ఈ నేపథ్యంలో అనర్హులు కొందరు ఉద్యోగాలు పొందగా.. మరికొందరు అడ్డంగా దొరికినట్లు తేలింది. మరికొందరి సర్టిఫికెట్లపై విచారణ కూడా సాగింది. అయితే ఆశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పు చేశారని తెలిసిన కూడా వారిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పైరవీలు షురూ..

ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు పైరవీకారులు ఇప్పటికే తమ పనిని షురూ చేసినట్లు ప్రచారం. వైద్యారోగ్యశాఖ ప్రధాన అధికారికి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ ఉద్యోగి ద్వారా పైరవీలు మొదలు పెట్టినట్లు తెలిసింది. ఒక్కో ఉద్యోగానికి రూ. 2లక్షల మేరకు డిమాండ్ చేస్తూ సగం డబ్బులు ముందుగా ఇవ్వాలని చెబుతున్నట్లు తెలిసింది. అదే విధంగా మరికొందరు వైద్యారోగ్యశాఖ రాష్ట్ర అధికారులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా తమ పైరవీలు ప్రారంభించినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో తమకు ఉద్యోగం వస్తుందో లేదో అని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

వచ్చిన దరఖాస్తుల వివరాలు

పోస్టు	పోస్టుల సంఖ్య	వచ్చిన దరఖాస్తులు
ఎంహెచ్ఎన్ స్టాఫ్‌నర్సు	02	89
ఎన్‌సీడీ స్టాఫ్ నర్సు	10	881
క్వాలిటీ మేనేజర్	01	05
రిఫ్రిజిరేటర్ మెకానిక్	01	14
సపోర్టింగ్ స్టాఫ్	01	103
ఎంఎల్‌హెచ్‌పీ	10	335
ఫిజియోథెరపిస్ట్	01	27
రేడియోగ్రాఫర్	01	26
ఫార్మసిస్టు	01	116
మెడికల్ ఫీసర్ (ఆర్‌బీఎస్‌కే)	09	61
మొత్తం	37	1657

పైరవీలకు తావులేదు



వైద్యారోగ్యశాఖలోని కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీలో ఎటువంటి పైరవీలకు తావులేదు. రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మెరిట్ ప్రకారం జాబితా రూపొందిస్తాం. నిరుద్యోగులు పైరవీకారుల మాటలు నమ్మి డబ్బులు ఇవ్వకండి. నియామక కమిటీ ఆధ్వర్యంలో ప్రక్రియ జరుగుతుంది.
– అంబరీష, జిల్లా వైద్యాధికారి

వైభవంగా వీరభద్రుడి రథోత్సవం



రథాన్ని లాగుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, తదితరులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



భద్రకాళీ, వీరభద్రస్వామి ఉత్సవమూర్తులు

కురవి: భద్రకాళీ సమేత వీరభద్రుడి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి 7గంటలకు పలు రకాల పూలతో అలంకరించని రథంపై కల్యాణ వీరభద్రుడు భద్రకాళీ అమ్మవారి సమేతంగా పూజలు అందుకున్నారు. 8.30గంటలకు రథంపై గ్రామ సేవకు కదలివెళ్లారు. ఆలయ అర్చక స్వాములు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ పూజారులు విజయ్, విజయ్‌కుమార్, అభిలాష్, పుణ్యమూర్తి ఛండీశ్వరుడిని తీసుకొచ్చి అగ్ని హోమం, వాస్తు పూజలు చేశారు. ఆలయం నుంచి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఉత్సవమూర్తులను ప్రధాన పూజారి పెనుగొండ అనిల్‌కుమార్ ప్రత్యేక శావలో మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చి రథంలో అధిష్టింపజేశారు. దిష్టికుంభ పూజ చేసిన తర్వాత ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావు, ఈఓ సత్యనారాయణ గుమ్మడి కాయలు కొట్టారు. భక్తుల జయజయధ్వానాల నడుమ స్వామి వారి రథాన్ని ఎస్పీ, ఈఓ, ఆలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి, భక్తులు లాగారు. రథాన్ని గ్రామ పంచాయతీ వరకు తీసుకొచ్చి.. గ్రామస్తుల పూజల అనంతరం తిరిగి ఆలయానికి చేర్చారు.

విప్, ఎమ్మెల్యే పూజలు..

రథోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ పాల్గొని పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, శివ ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, వెంకటేష్‌గౌడ్, ఉప్పలయ్య, ఆలయ మాజీ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ కురవి, సీరోలు మండలాల అధ్యక్షులు అంబటి వీరభద్రం, కరుణాకర్ రెడ్డి, నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, రాజేందర్‌కుమార్, కాలం రవీందర్‌రెడ్డి, అవిరె మోహన్‌రావు, వద్దుల ఉపేందర్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

నిస్వార్థ నేత 'నెమరుగొమ్ముల'

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు మృతితో విషాదం

21 ఇంటి స్థలాలు, 7ఎకరాల పొలం

- కరీంనగర్ జిల్లా జమ్మికుంట తహసీల్దార్ రజని ఇంట్లో ఏసీబీ తనిఖీలు.. - 8లో▸

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5లక్షలతో సీసీ రోడ్డు, 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5లక్షలతో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. గిరిప్రసాద్ నగర్, నర్సంపేట రోడ్డు నుంచి ఎల్‌బీజీనగర్ వరకు సుమారు 800మీటర్ల సీసీ రోడ్డు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఏటిగడ్డతండా వద్ద ఉన్న రైతు వేదిక నుంచి రాళ్లవాగు మీదుగా కేసముద్రం వెళ్లే రహదారిని కలిపేందుకు బైపాస్ రోడ్డు మంజూరు చేయిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 16వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, స్థానిక కౌన్సిలర్ బానోత్ పద్మ సీతారాంనాయక్, రావుల లలిత, రావుల రాజు, లక్ష్మణ్, ఎడ్ల రమేష్, రాజు, శ్రీను, శివకుమార్, చుక్కల ఉదయ్‌చందర్, లక్ష్మయ్య, సారయ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం చెరువు ఎఫ్‌టీఎల్ సర్వే

- పలువురి అభ్యంతరం



సర్వే అధికారులకు వివరిస్తున్న హస్తినాపురం కాలనీవాసులు

మహబూబాబాద్: నిజాం చెరువు ఎఫ్‌టీఎల్ హద్దుల కోసం ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బుధవారం సర్వే చేపట్టారు. ఇరిగేషన్ డీఈ కిషోర్‌కుమార్, ఏఈ శ్రావణి, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణప్రసాద్, మున్సిపాలిటీ నుంచి కౌశిక్ సర్వే చేస్తున్న క్రమంలో హస్తినాపురం కాలనీకి చెందిన పలువురు అభ్యంతరం తెలిపారు. స్థలాలు కొనుగోలు చేసి గృహ నిర్మాణాలు చేసుకున్నామని, అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయని, సర్వే పేరుతో ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు వివరించారు. కేసు కోర్టు పరిధిలో ఉందని, అన్ని పత్రాలతో అధికారులకు వివరించారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు తాత్కాలికంగా సర్వే నిలిపివేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. నిజాం చెరువు విస్తీర్ణం 67 ఎకరాలుగా రికార్డులో ఉందన్నారు. ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లో ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొదన్నారు. నిజాంచెరువు వద్ద గోపాలపురం నుంచి హస్తినాపురంకాలనీ వరకు వేసిన రోడ్డు తొలగించాలని ఆదేశాలు ఉండడంతో ఎఫ్‌టీఎల్ సర్వే చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం స్థానికుల అభ్యంతరం మేరకు తాత్కాలికంగా సర్వే నిలిపివేసినట్లు తెలిపారు. సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నడుమ సర్వే చేపట్టారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి



లేఅవుట్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. మున్సిపాలిటీ టంకుతండా సమీపంలో వెంచర్ ఏర్పాటుకు లేఅవుట్ కోసం దరఖాస్తు చేసుకున్న భూమిని బుధవారం అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. వెంచర్‌లో ఇళ్ల స్థలాల ఏర్పాటు నిబంధనల ప్రకారం జరగాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించి రోజువారి కార్యకలాపాలను పరిశీలించారు. మున్సిపాలిటీ సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. పట్టణ సమీపంలోని బంధం చెరువు వద్ద మున్సిపాలిటీ చెత్త వేస్తున్న స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, టీపీఎస్ రమేష్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పాతకాపులే..



- మానుకోట బీజేపీ ఎంపీ అభ్యర్థిగా అజ్మీరా సీతారాంనాయక్
- ప్రకటించిన ఆ పార్టీ అధిష్టానం
- ఇటీవల బీఆర్ఎస్ అభ్యర్థిగా కవిత, కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్ ఖరారు

సాక్షి, మహబూబాబాద్: నేడో.. రేపో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ మాలోత్ కవిత పేరును ఆ పార్టీ ముందుగా ప్రకటించగా.. గత శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ పేరును ప్రకటించారు. అలాగే బుధవారం బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌ను ఖరారు చేశారు.

అలా చేరారు.. ఇలా టికెట్ వచ్చింది..

మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బీఆర్ఎస్ నుంచి బీజేపీలో అలా చేరారో.. లేదో.. ఇలా టికెట్ తెచ్చుకున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన సీతారాంనాయక్ కేయూ ప్రొఫెసర్‌గా కొనసాగుతూనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఇలా బీఆర్ఎస్(అప్పటి టీఆర్ఎస్) అధినేత కేసీఆర్‌కు దగ్గరైన ఆయన.. స్వరాష్ట్రంలో 2014 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందారు. మానుకోట పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌పై విజయం సాధించారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన స్థానంలో మాలోత్ కవితకు టికెట్ ఇచ్చారు. అతర్వాత ఆయన మౌనంగా ఉంటూ వచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు టికెట్ ఇవ్వాలని కోరగా.. అది దక్కలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న సీతారాం నాయక్ టికెట్ రాదని తెలిసి, ఈ నెల 10న బీజేపీలో చేరారు. చేరిన మూడు రోజులకే పార్టీ టికెట్ దక్కడం గమనార్హం.

ప్రాతినిథ్యం వహించిన వారే..

ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు పోరికబలరాం నాయక్, అజ్మీరా సీతారాం నాయక్, మాలోత్ కవిత మానుకోట పార్లమెంట్ నుంచి ప్రాతినిథ్యం వహించిన వారు కావడం విశేషం. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన బలరాంనాయక్ సమీప అభ్యర్థి కుంజ శ్రీనివాసరావుపై 68,957ఓట్ల మెజార్టీతో గెలిచి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. తర్వాత జరిగిన 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన సీతారాంనాయక్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌పై 34,992 ఓట్ల మెజార్టీతో గెలిచారు. తర్వాత జరిగిన 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన మాలోత్ కవిత బలరాంనాయక్‌పై 1,46,663ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇలా ప్రస్తుతం ప్రధాన పార్టీల నుంచి పోటీ పడుతున్న ముగ్గురు గతంలో ఎంపీలుగా పనిచేసిన వారే... ఒకరిపై మరొకరు గెలవడం గమనార్హం.

వరంగల్ టికెట్ కావ్యకే..

- ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన గులాబీ అధినేత కేసీఆర్
- బీఆర్ఎస్‌లో వీడిన సస్పెన్స్



సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు గులాబీ దళపతి, పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం సాయంత్రం అధికారికంగా ప్రకటించారు. రాజకీయ అరంగేట్రం చేసేందుకు ఎప్పటినుంచో వేచి చూస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్యకు ఎట్టకేలకు బీఆర్ఎస్ 'బీ'ఫామ్ దక్కింది. సిట్టింగ్ ఎంపీగా ఉన్న పసునూరి దయాకర్‌ను ఈసారికి పోటీ నుంచి తప్పించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత సిట్టింగ్ ఎంపీని మార్చడం తథ్యమన్న నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎవరిని ఎంపిక చేస్తారన్న చర్చ మొదలైంది. వరంగల్ ఎంపీ స్థానం ఎస్సీలకు రిజర్వు కావడంతో పార్టీలో ఈ సామాజిక వర్గానికి చెందిన నేతల్లో ఎవరికి అవకాశం దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, కడియం కావ్యల పేర్లు ప్రధానంగా వినిపించాయి. అరూరి రమేశ్ మొదట ఆసక్తి చూపినా.. ఆ తర్వాత ఎందుకో పార్టీ మారాలనే యోచనలో పడటం పార్టీలో గందరగోళానికి తెరతీసింది. ఇదే సమయంలో ఆయన మంగళవారం హైదరాబాద్‌లో కేంద్రమంత్రులను కలవడం.. బుధవారం హనుమకొండలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ప్రెస్‌మీట్‌లో మాట్లాడేకంటే ముందే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు ఆయనను తమ వాహనాల్లో ఎక్కించుకుని హైదరాబాద్ తీసుకెళ్లి కేసీఆర్‌ను కలిపించారు. ఉమ్మడి వరంగల్ కీలక నేతలు, ప్రజాప్రతినిధులతో సుమారు గంటన్నర పాటు చర్చించిన కేసీఆర్.. కడియం కావ్య పేరును ఖరారు చేసినట్లు ప్రకటించారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు



ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం శివారు ఆకేరు వాగు ఒడ్డున నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగాభవాని అమ్మవారిని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల కనుల పండువగా ప్రతిష్ఠించారు. నరేష్ రెడ్డి ఆహ్వానం మేరకు బుధవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు మంత్రులకు ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నరేష్‌రెడ్డి తన మామిడితోటలో ఇచ్చిన విందును మంత్రులు స్వీకరించారు. కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, సీనియర్ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నెహ్రూ నాయక్, మహబూబాబాద్, ఇల్లెందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, ఆదినారాయణ, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మిల్లర్‌ ఢీకొని యువకుడి మృతి


మహేష్‌(ఫైల్‌)

కురవి: సిమెంట్‌ మిక్సింగ్‌ మిల్లర్‌ లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని తట్టుపల్లిలో జరిగింది. ఎస్సై బి.గోపి కథనం ప్రకారం.. తట్టుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మండలంలోని మోద్గులగూడెం గ్రామానికి చెందిన కొమ్మురాజుల మహేష్‌(24) ఈ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో సిమెంట్‌ మిక్సింగ్‌ మిల్లర్‌ (లారీ) డ్రైవర్‌ జి.అంజి వాహనం అజాగ్రత్తగా నడిపి మహేష్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి రమేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి..


ముఖేష్‌(ఫైల్‌)

నర్సింహులపేట: కళాశాలకు వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన కుమారుడు.. పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జయపురంలో చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీష్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాచమల్ల వెంకన్న,సైదమ్మ దంపతుల కుమారుడు ముఖేష్‌(21) మహబూబాబాద్‌ డిగ్రీ కళాశాలలో ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల నుంచి కళాశాలకు వెళ్లడం లేదు. దీనిపై వెంకన్న.. కుమారుడిని మందలించాడు. ఈ విషయంలో మనస్తాపానికి గురైన ముఖేష్‌ ఈ నెల 10వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే మహబూబాబాద్‌ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌పైనుంచి పడి వృద్ధురాలు..

వేలేరు: ద్విచక్రవాహనం పైనుంచి పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామానికి చెందిన బండారు చంద్రభాగ(65) పని నిమిత్తం వేలేరుకు వచ్చింది. అనంతరం గొల్లకిష్టంపల్లికి వెళ్తున్న క్రమంలో దారిలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని లిఫ్ట్‌ అడిగి ద్విచక్రవాహనంపై కూర్చుంది. ఈ క్రమంలో వృద్ధురాలి చీరకొంగు వెనుక టైరులో చిక్కుకుంది. దీంతో ద్విచక్ర వాహనం నుంచి పడి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా అంబులెన్స్‌ వచ్చి చికిత్స ప్రారంభించేలోపే మృతి చెందింది.

షార్ట్‌సర్క్యూట్‌తో స్వీట్‌హౌస్‌ దగ్ధం

- వరంగల్‌ వాసవి కాలనీలో ఘటన
- రూ.5 లక్షలు ఆస్తి నష్టం


దగ్ధమవుతున్న స్వీట్‌హౌస్‌

వరంగల్‌ : వరంగల్‌ వాసవికాలనీలోని స్వాగత్‌ స్వీట్‌ హౌస్‌ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం స్వీట్‌ హౌస్‌లో ఏసీ నుంచి ఒకే సారి పొగలు రావడం.. వెంటనే మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో షాపులో ఉన్న వారంతా బయటకు పరుగులు తీశారు. వరంగల్‌ ఫైర్‌ స్టేషన్‌కు సమాచారం అందించడంతో అధికారులు వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేసినట్లు వరంగల్‌ ఎస్‌ఎఫ్‌ఓ రవీందర్‌ తెలిపారు. కాగా, ప్రమాదంలో సుమారు రూ.20లక్షల వరకు నష్టం జరిగిందని స్వీట్‌హౌస్‌ యాజమాని శివకుమార్‌గోయల్‌ తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది గణేష్‌, సురేందర్‌, రాజేందర్‌, రవి పాల్గొన్నారు.

పర్యాటకుల కల నెరవేరేనా..?


మధ్యకోటలో మ్యూజియం భవనం


పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న మ్యూజియం భవనం

- ప్రారంభోత్సవానికి నోచుకోని మ్యూజియం
- పిచ్చిమొక్కలతో నిండిన పరిసర ప్రాంతాలు
- అందుబాటులోకి తీసుకురావాలంటున్న చరిత్రకారులు

ఖిలా వరంగల్‌ : చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్‌ కోటలో మ్యూజియం ఏర్పాటుకు ఉమ్మడి రాష్ట్రంలోనే బీజం పడింది. నాటి కాంగ్రెస్‌ ప్రభుత్వం పలుమార్లు నిధుల కేటాయింపుతో పాటు శిలాఫలకాలతోనే సరిపెట్టుకుంది. అంతలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కాకతీయ రాజులు, రాణులు, సైన్యం వాడిన వివిధ రకాల ఆయుధాలు రాతిశిల్పాలు, నాణెలు, పింగాణి పాత్రలు, ఇతర పరికరాలను ఒకే చోట మ్యూజియంలో ఉంచి ప్రదర్శించేందుకు గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2015 జనవరిలో పర్యాటకశాఖ మంత్రి చందులాల్‌ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.

నాటి నుంచి నత్తనడకనే..

చింతల్‌ బ్రిడ్జి నుంచి మధ్యకోటకు వెళ్లే రహదారిపై నిర్మించిన మ్యూజియం ప్రారంభోత్సం కోసం ఎదురుచూస్తున్నారు. తొలుత మధ్యకోటలోని ప్రభుత్వం కొనుగోలు చేసిన ఒకరం భూమిలో సుమారు రూ.7కోట్లతో నిర్మించిన మ్యూజియం భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. గత తొమ్మిదేళ్లుగా భవన నిర్మాణపనులు నత్తనడకన సాగినా నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పిచ్చిమొక్కలే దర్శనం..

మ్యూజియం ప్రారంభం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూపులు మాత్రం తప్పడంలేదు. భవన నిర్మాణం పూర్తి చేసుకున్నా పర్యాటకులు మాత్రం నిరాశతో వెనుదిరుగుతున్నారు. నిర్మాణం ప్రారంభమై తొమ్మిదేళ్లు కావొస్తున్నా ప్రారంభానికి నోచుకోవట్లేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు పలుమార్లు నివేదించగా అప్పటి రాష్ట్ర టూరిజం శాఖ రూ.3 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి రాష్ట్ర పురావస్తుశాఖకు అప్పగించాలని ఆదేశించినా అధికారుల అలసత్వం.. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో మ్యూజియం ప్రాంగణం జిల్లేడు, ముళ్ల కంప, పిచ్చిమొక్కలతో నిండి ఉంది. ఇప్పటికైనా పర్యాటక మంత్రి కొండా సురేఖ మ్యూజియం భవనాన్ని పరిశీలించి పర్యాటకులు వీక్షించేలా మ్యూజియాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు, నగర ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కోసం ఎదురు చూస్తున్నాం



మ్యూజియం నిర్మించి నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రభుత్వాలు మారిన ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. ప్రారంభమైతే యువతకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి లభిస్తోందని ఆశతో ఎదురుచూస్తున్నాం. మంత్రి సురేఖ మ్యూజియం భవనాన్ని పరిశీలించాలి.

-బైరబోయిన శివాజీ, మధ్యకోట

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం



ప్రభుత్వ మారింది. మ్యూజియం భవనంలో చేయాల్సిన అభివృద్ధి పనులపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారుల నివేదించాం. టూరిజం శాఖ అభివృద్ధి చేసే రాష్ట్ర పురావస్తుశాఖకు అప్పగిస్తే పర్యాటకులు వీక్షించేలా నిర్ణయం తీసుకుంటాం.

-మల్లునాయక్‌, ఏడీ రాష్ట్ర పురావస్తుశాఖ

వేధిస్తున్నాడనే చంపించింది..

వీడిన రిటైర్డ్‌ ఉద్యోగి హత్య మిస్టరీ
- ప్రధాన నిందితురాలు భార్య
- నలుగురు మైనర్లతో సహా తొమ్మిది మందిపై కేసు
- అరెస్ట్‌, రిమాండ్‌


మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హసన్‌పర్తి: రెండు రోజుల క్రితం హత్యకు గురైన సింగరేణి రిటైర్డ్‌ ఉద్యోగి పోశం మర్డర్‌ మిస్టరీ వీడింది. ఈ హత్యలో భార్య ప్రధాన నిందితురాలని పోలీసులు పేర్కొన్నారు. భర్త వేధింపులు భరించలేకనే సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. హత్యకు దారితీసిన వివరాలను బుధవారం ఆయన విలేకరులకు వెల్లడించారు. బెల్లంపల్లికి చెందిన గజెల్లి పోశం(70) సింగరేణి ఉద్యోగి. ఇతడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు సంధ్యారాణి, దివ్య ఉన్నారు. 12 ఏళ్ల క్రితం పోశం ఉద్యోగ విరమణ పొందాడు. దీంతో భార్య లక్ష్మితో పాటు పోశం కరీంనగర్‌లో ఓ అద్దె ఇంటిలో ఉంటున్నాడు.

భార్య ఆశ్రమానికి.. భర్త కూతురు వద్దకు

కాగా, భర్త వేధింపులు భరించలేక లక్ష్మి హైదరాబాద్‌లోని 'కడలి' ఆశ్రమానికి వెళ్లగా, పోశం కుమార్‌పల్లిలోని తన కూతురు దివ్య వద్దకు వచ్చాడు. నాలుగు నెలల తర్వాత లక్ష్మి మళ్లీ కరీంనగర్‌కు వెళ్లి ఓ ఇల్లు అద్దె తీసుకుంది. తాను కరీంనగర్‌కు వచ్చినట్లు తెలిస్తే పోశం మళ్లీ వచ్చి వేధిస్తాడని భావించింది. దీంతో అతడి అడ్డు తొలగించడానికి పథకం రచించింది. ఇందులో భాగంగా మైనర్‌తో పరిచయం పెంచుకుంది. తన భర్త పోశం గురించి వివరించి అతడిని చంపితే రూ. లక్ష ఇస్తానని ఆశ చూపింది. దీంతో ఆ మైనర్‌ అదే ప్రాంతానికి చెందిన సూరం సిద్దుకు విషయం వివరించగా అతడు హత్య చేయడానికి సిద్ధమయ్యాడు. ఆతర్వాత తన పెద్ద కూతురు సంధ్యారాణి నుంచి పోశం ఫొటో సేకరించింది. కరీంనగర్‌కు చెందిన మహేందర్‌ అనే యువకుడిని ద్వారా పోశం ఫొటోను తెప్పించుకుంది.

కారులో హనుమకొండకు..

ఈనెల 9న లక్ష్మి, సూరం సిద్ధు, మహేందర్‌తో పాటు మైనర్‌.. కరీంనగర్‌ నుంచి ఓ కారును అద్దెకు తీసుకుని హనుమకొండకు వచ్చారు. ఇక్కడ వీరికి మరో ముగ్గురు మైనర్లతో పాటు రాంచరణ్‌, వినయ్‌(మహేందర్‌ స్నేహితులు) జతకలిశారు. ఆ తర్వాత లక్ష్మి తిరిగి కరీంనగర్‌కు వెళ్లింది. పోశంను ప్లాట్లు వద్దకు రమ్మించారు. ప్లాట్లు కొంటామని నమ్మించి కారులో కోమటిపల్లి శివారులోకి తీసుకుని మద్యం తాగించి రాళ్లతో మోదీ హత్య చేశారు. ఈ ఘటనపై మృతుడి కూతురు దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో విచారణ చేపట్టినట్లు ఏసీపీ చెప్పారు. ఈహత్య కేసులో ప్రధాన నిందితురాలు గజెల్లి లక్ష్మి, సూర సిద్ధు, రామ్‌ చరణ్‌, మహేందర్‌, వినయ్‌ పాటు మరో నలుగురు మైనర్లను అరెస్ట్‌ చేసి డిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ సంజీవ, ఎస్సై రాజ్‌కుమార్‌, విజయ్‌కుమార్‌, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

దంపతుల మధ్య గొడవలు..

పోశం, లక్ష్మి దంపతులకు నిత్యం స్వల్ప గొడవలు జరిగేవి. పోశం మద్యం సేవించి భార్యను హింసించేవాడు. అలాగే, హనుమకొండ గుండ్ల సింగారంలో ఓ ప్లాట్లు అమ్మకం విషయంలో వీరి మధ్య వివా దం నెలకొంది. ప్లాట్లు విక్రయించొద్దని భార్య లక్ష్మి వారించినా పోశం మాత్రం అమ్మడానికే సిద్ధపడ్డాడు. ఈ విషయంలో నిత్యం దంపతుల మధ్య గొడవల కారణంగా యజమాని ఇల్లు ఖాళీ చేయించాడు.

గంజాయి రవాణా కేసులో నలుగురికి ఇరవై ఏళ్ల జైలు

మహబూబాబాద్‌ రూరల్‌ : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో నలుగురికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష, రూ. 4 లక్షలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్‌ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్‌ బుధవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. 2021 సెప్టెంబర్‌ 30వ తేదీన మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలం కోబల్‌ తండాకు చెందిన ధరంసోత్‌ శ్రీను ఇంటి వద్ద వంద కిలోల ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆ సమయంలో గూడూరు ఎస్సైగా ఉన్న బి.సతీష్‌.. గూడూరు మండలం బుధరావుపేటకు చెందిన షేక్‌ఇస్మాయిల్‌, కోబల్‌ తండాకు చెందిన ధరంసోత్‌ శ్రీను, బ్రాహ్మణపల్లి హాము తండాకు చెందిన ధరావత్‌ కిరణ్‌, వరంగల్‌ జిల్లా దుగ్గొండి మండలం చాపలబండకు చెందిన పాలకొండ సాంబమూర్తి, ఏపీలోని విశాఖపట్నం దారకొండ ప్రాంతానికి చెందిన కుమార్‌, గూడూరు మండలం మూడు గుడిసెల లైన్‌ తండాకు చెందిన భూక్యా బన్సీలాల్‌ పై కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి సీఐ రాజిరెడ్డి కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేయగా ఎస్సై బి.రాణాప్రతాప్‌ ట్రయల్స్‌ నడిపారు. ప్రాసిక్యూషన్‌ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టు లైజనింగ్‌ అధికారి, ఎస్సై బాణాల వెంకటాచారి, ప్రస్తుత గూడూరు సీఐ బాబురావు, ఎస్సై నగేష్‌ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఇందులో ఇస్మాయిల్‌, శ్రీను, కిరణ్‌, సాంబమూర్తిపై నేరం నిరూపణకాగా కుమార్‌ పరారీలో ఉండగా బన్సీలాల్‌ పై నేరం నిరూపణ కాలేదు. వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్‌ నేరం నిరూపణకాబడిన నలుగురికి ఒక్కొక్కరికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష, రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

సర్వమానవాళి ఆధ్యాత్మికతతో ఎదగాలి

- హైదరాబాద్‌ అగ్రపీఠాధిపతి కార్డినల్‌ పూల ఆంథోని
- ముగిసిన ఫాతిమా మాత ఉత్సవాలు


కేక్‌ కట్‌చేస్తున్న కార్డినల్‌ పూల ఆంథోని, బిషప్‌ ఉడుముల బాల, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్‌: సర్వమానవాళి ఆధ్యాత్మిక భక్తి భావంతో ఎదగాలని, కుటుంబంలో పెద్దలు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని, మరియమాత దీవెనలతో ముందుకు సాగాలని హైదరాబాద్‌ అగ్రపీఠాధిపతి కార్డినల్‌ పూల ఆంథోని అన్నారు. బుధవారం కాజీపేట ఫాతిమామాత ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవాళి మనుగడకు భక్తిభావం, ప్రేమ, సోదర భావం అలవర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. వరంగల్‌ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఫాతిమా మాత ఉత్సవాలు ఆదర్శమన్నారు. మాజీ కార్పొరేటర్‌ అబుబక్కర్‌ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఫాతిమా చర్చి చరిత్ర తెలిసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇందుకు ఎమ్మెల్యే రాజేందర్‌ రెడ్డి చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా కార్డినల్‌ పూల ఆంథోని, పీఠాధిపతి ఉడుముల బాల కేక్‌కట్‌ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూల ఆంథోని, ఉడుములబాల.. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఓరుగల్లు పీఠాధిపతి బిషప్‌ ఉడుములబాల, కేథడ్రల్‌ చర్చి ప్రీస్ట్‌ కాసుమరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టి.రాజయ్య, అమృతరావు, ఫాతిమా కేథడ్రల్‌ కౌన్సిల్‌ అధ్యక్ష, కార్యదర్శులు బి.దయాసాగర్‌, టామి, ఉత్సవాల నిర్వాహణ కమిటీ సభ్యులు కోఆర్డినేటర్లు, మఠ కన్యలు, స్థానిక కార్పొరేటర్‌ మానస రాంప్రసాద్‌ పాల్గొన్నారు.

కాజీపేట బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్‌


బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్‌

కాజీపేట: కాజీపేట బ్రిడ్జిపై బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనతో కొద్దిసేపు ట్రాఫిక్‌ స్తంభించింది. ఒక పక్క ఫాతిమ మాత ఉత్సవాలు.. మరోపక్క రోడ్డు ప్రమాదంతో ట్రాఫిక్‌ నిలిచింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు. కాగా, ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

కేయూలో ఇద్దరికి కారుణ్య నియామకాలు


కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ రమేష్‌

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరికి కారుణ్యనియామకాల ఉత్తర్వులను వీసీ ఆచార్య తాటికొండ రమేష్‌ బుధవారం అందజేశారు. వీరిలో గడ్డం నరేష్‌కు క్లర్క్‌కమ్‌ టైపిస్టుగా విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ఖమ్మంకు పోస్టింగ్‌ ఇచ్చారు. అలాగే జంగా కార్తీక్‌ యాదవ్‌కు విశ్వవిద్యాలయం దూరవిద్యాకేంద్రంలో ఆఫీస్‌ సబార్డినేట్‌గా పోస్టింగ్‌ ఇచ్చారు. దూర విద్యాకేంద్రంలో ఆఫీస్‌ సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గడ్డం నరేందర్‌ డిసెంబర్‌ 2021లో మృతి చెందాడు. కారుణ్య నియామకాన్ని ఆయన కుమారుడైన గడ్డం నరేష్‌కు అవకాశం కల్పించారు. అలాగే జంతుశాస్త్ర విభాగంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ 2023 అక్టోబర్‌లో మృతి చెందిన జంగా రాజేంద్రప్రసాద్‌ కమారుడైన జంగా కార్తీక్‌యాదవ్‌కు కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసినట్లు కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ పెండ్లి అశోక్‌బాబు ఉన్నారు.

21 ఇంటి స్థలాలు, 7 ఎకరాల పొలం

తహసీల్దార్‌ రజని ఇంట్లో ఏసీబీ తనిఖీలు
- రూ.12 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు
- కరీంనగర్‌ జిల్లా జమ్మికుంట తహసీల్దార్‌గా పనిచేస్తున్న రజని
- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు
- హనుమకొండ జిల్లాలో ఆరుచోట్ల ఏకకాలంలో దాడులు
- ఏసీబీ కోర్టులో హాజరు.. రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి


సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు


తహసీల్దార్‌ రజని

వరంగల్‌ క్రైం: రెండు అంతస్తుల ఇల్లు, 21 ఇంటి స్థలాలు, ఏడు ఎకరాల భూమి, కిలోన్నర బంగారం.. ఇతరత్రా కలిపి మార్కెట్‌ విలువ ప్రకారం రూ.12 కోట్ల ఆస్తులు.. ఇవన్నీ కరీంనగర్‌ జిల్లా జమ్మికుంట తహసీల్దార్‌ మర్కల రజనికి చెందిన హనుమకొండలోని ఇంటితోపాటు మరో ఐదు చోట్ల ఏకకాలంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం నిర్వహించిన దాడుల్లో వెలుగుచూశాయి. ఉదయం నుంచి హనుమకొండలోని కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీ, ధర్మసాగర్‌, మరో నాలుగు చోట్ల ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. తహసీల్దార్‌ రజని ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం ఆమె బంధువులు, సన్నిహితుల ఇళ్లను టార్గెట్‌ చేసుకుని సోదాలు చేశారు. కరీంనగర్‌ ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో ఒక్కో చోట ఇన్‌స్పెక్టర్‌ స్థాయి ఆధ్వర్యంలో దాడులు కొనసాగాయి. ఆమె గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన ప్రాంతాల్లో ఆమెకు సన్నిహితంగా ఉన్న రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారుల ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహించారు.

రూ.12కోట్ల అక్రమాస్తులు..


తహసీల్దార్‌ మర్కల రజనిపై ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయని డీఎస్పీ రమణామూర్తి తెలిపారు. ఏసీబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లాలో ఆరు చోట్ల దాడులు నిర్వహించామన్నారు. రజనికి హనుమకొండలో కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీలో రెండు అంతస్తుల ఇల్లు, 21 ఇంటి స్థలాలు, 7 ఎకరాల భూమి, 2 కార్లు, 3 ద్విచక్ర వాహనాలు, బ్యాంకులో రూ.25లక్షలు, లాకర్లు, ఇంట్లో కిలోన్నర బంగారం, ఇంట్లో రూ.1.50 లక్షల నగదు లభించినట్లు చెప్పారు. దీని విలువ (ప్రభుత్వ విలువ ప్రకారం) రూ.3.25 కోట్లు. ఇందులో సుమారు రూ.3కోట్ల అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ మార్కెట్‌ ప్రకారం సుమారు రూ.12 కోట్ల వరకు ఉంటుందని డీఎస్పీ రమణామూర్తి పేర్కొన్నారు. తహసీల్దార్‌ రజనిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌ ఏసీబీ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రమణామూర్తి తెలిపారు.


కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీలోని తహసీల్దార్‌ రజని ఇల్లు

నిస్వార్థ నేత 'నెమరుగొమ్ముల'..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ సుధాకర్‌రావు కన్నుమూత
- ఉమ్మడి జిల్లాలో విషాదఛాయలు
- పొలిటికల్‌ ఆపరేషన్‌తో రాజకీయ అరంగేట్రం
- లైఫ్‌ ఇచ్చిన చోట.. డాక్టర్‌ సాబ్‌ డెత్‌


సికింద్రాబాద్‌ యశోద ఆస్పత్రిలో సుధాకర్‌రావు భౌతికకాయం వద్ద ఎమ్మెల్యేలు కడియం, రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి


మాజీ సీఎం కేసీఆర్‌తో సుధాకర్‌రావు(ఫైల్‌)

దేవరుప్పుల/ కొడకండ్ల: మాజీ మంత్రి నెమరుగొమ్ముల యతిరాజారావు తనయుడు.. ప్రముఖ డయాబెటిక్‌ వైద్యుడు, నిస్వార్థ నేతగా పేరొందిన సుధాకర్‌రావు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. దీంతో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, సుధాకర్‌రావు తనదైన శైలిలో పొలిటికల్‌ ఆపరేషన్‌లో విజయం సాధించి టీడీపీ ప్రభుత్వంలో శాసన సభ్యుడిగా రాణించి నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. సికింద్రాబాద్‌ గాంధీలో సూపరింటెండెంట్‌ స్థాయి ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చిన అనంతరం.. తన జీవనమనుగడ కోసం సికింద్రాబాద్‌ యశోద ఆస్పత్రిలో వైద్య వృత్తిని కొనసాగించారు. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వైద్యుడిగా కొనసాగే క్రమంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో దేవరుప్పుల మండలం.. చెన్నూరు, జనగామ నియోజకవర్గాల ప్రాతినిధ్యంలో ఉండేది. నక్సల్స్‌ ప్రభావిత కాలంలో ఈ మండలంలోని ఐదు గ్రామాలు చెన్నూరు నియోజకవర్గంలో కీలకంగా ఉండేవి. అందరితో అన్యోన్యంగా ఉండే డాక్టర్‌ సాబ్‌ ఇక్కడ తన తండ్రి రాజకీయానికి డోకా లేకుండా మొదలుపెట్టిన పొలిటికల్‌ ఆపరేషన్‌.. చివరికి తాను ఎమ్మెల్యే అయ్యేలా దోహదపడింది. తెలంగాణ సాధన దిశలో దుగ్యాల శ్రీనివాస్‌రావు రావడంతో ఓటమి చవిచూసిన డాక్టర్‌ సాబ్‌ తిరిగి 1969 నాటి అనుభవంతో మలివిడత ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మమేకమై తనదైన ముద్ర వేసుకున్నారు. అయితే ఈ ప్రాంతానికి దయాకర్‌రావు రావడం.. మారిన రాజకీయ పరిణామాలతో ఎట్టకేలకు ఒకే పార్టీలో కలిసి ఉండే క్రమంలో చివరిగా తన వృత్తి సంబంధమైన శాఖలో భాగంగా ఆరోగ్యశ్రీ ట్రస్టు స్టేట్‌ చైర్మన్‌ గా కొద్ది నెలలు మాత్రమే బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. వయసు పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలోనే పాలకుర్తి నియోజకవర్గంలో చివరిగా జనవరి 28న అప్పిరెడ్డి పల్లెకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక కావడంతో ఆ గ్రామానికి వచ్చి సత్కరించారు.

కొడకండ్ల అభివృద్ధిలో 'డాక్టర్‌' సాబ్‌ మార్క్‌

మాజీ ఎమ్మెల్యే, గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌ చైర్మన్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్‌ నెమురుగొమ్ముల సుధాకర్‌రావుకు కొడకండ్ల మండలంతో వీడదీయరాని అనుబంధం ఉంది. పూర్వ చెన్నూరు (ప్రస్తుత పాలకుర్తి) ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ఆయన చేసిన అభివృద్ధి చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. కొడకండ్లలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఏర్పాటు, బాలికల రెసిడెన్షియల్‌ గురుకుల పాఠశాల ఏర్పాటు, విద్యుత్‌ సబ్‌స్టేషన్‌తో పాటు రిజర్వాయర్‌ నిర్మించి ఎస్సారెస్పీ కాల్వలను పూర్తి చేయించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న మూడు వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మాణం చేయించారు. వ్యవసాయ మార్కెట్‌కు స్థలం కేటాయింపుతో పాటు భవన నిర్మాణం చేయించారు. ప్రభుత్వ పాఠశాలలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయించారు. మండలంలో సుధాకర్‌రావు చేసిన అభివృద్ధి తప్ప ఇప్పటికీ ఆ తరహా పనులు జరగడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

నేడు వడ్డెకొత్తపల్లిలో డాక్టర్‌సాబ్‌ అంత్యక్రియలు

సికింద్రాబాద్‌ యశోద ఆస్పత్రిలో ఉన్న సుధాకర్‌రావు భౌతికకాయాన్ని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు సందర్శించారు. పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లిలో బుధవారం సుధాకర్‌రావు అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ ఝాన్సీరెడ్డి సంతాపం తెలిపారు.

ఎంప్లాయిస్‌ సంఘ్‌లో మహిళలకు ప్రాధాన్యం

కాజీపేట రూరల్‌ : సౌత్‌ సెంట్రల్‌ రైల్వే ఎంప్లాయిస్‌ సంఘ్‌ మహిళా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు తీసుకెళ్తుందని సంఘ్‌ సీడబ్ల్యూసీ మెంబర్‌ సాదినేని వెంకటనారాయణ, సికింద్రాబాద్‌ ఉమెన్స్‌ కో ఆర్డినేటర్‌ మహాలక్ష్మి అన్నారు. కాజీపేట రైల్వేసంఘ్‌ కార్యాలయంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న రైల్వే మహిళా కార్మికులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాజీపేట అన్ని బ్రాంచీల సంఘ్‌ సెక్రటరీలు ముస్తాక్‌ హుస్సేన్‌, పాక రాజ్‌కుమార్‌, జగదీశ్వర్‌, అభిలాష్‌, బల్వీందర్‌సింగ్‌, చైర్మన్లు ఇ.నర్సింగరావు, బి.మాధవరావు, నారాయణ, రాజేందర్‌, కో–ఆర్డినేటర్‌ సవత, సీడబ్ల్యూసీ బ్రాంచీ ఆఫీస్‌ బేరర్‌ సరోజన పాల్గొన్నారు.